వైఎస్ఆర్
కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
సోమవారం 27 ఏప్రిల్ 2026



## అలరించిన చిన్నారుల నృత్యాలు..

**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 26 ప్రభాతవార్త:**

కడప శిల్పారామం లో సాంస్కృతి కళావేదిక పైన పద్మాకర్ ఆధ్వర్యంలో కడప నగరానికి చెందిన డాన్స్ బృందం విజయశాంతి శిష్య బృందం, ముద్ర డాన్స్ విద్యార్థి విద్యార్థులు నృత్యాలు చేశారు. తెలుగుదనానికి ఉట్టిపడే విధంగా సాంప్రదాయ వస్త్రధారులతో తమ అడుగుల స్టెప్పులతో ఎంతగానో ఆకర్షించినాయి శాస్త్రీయ నృత్యాలు, శిల్పారాధన కళావేదికను ప్రేక్షకుల చప్పట్లతో హోరత్తించినాయి. శిల్పారామం పరిపాలన అధికారి ఎస్ కృష్ణ ప్రసాద్ పర్యవేక్షణ చేశారు.



## పెట్రోల్ బంకును సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**నందలూరు ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**

కడప చెన్నై ప్రధాన రహదారిలోని కన్యక చెరువు సమీపంలో ఉన్న శ్రీ సౌమ్యనాథ పెట్రోల్ బంకును రాజంపేట సబ్ కలెక్టర్ భావన ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీజల్, పెట్రోల్ కొరత అనే వదంతులు నమ్మవద్దు అని అన్ని పెట్రోల్ బంక్ లో అందుబాటులో పెట్రోల్, డీజిల్ ఉన్నవి అని తెలియజేశారు. అనంతరం పెట్రోల్ బంక్ లో స్టాక్ వివరాలను యజమాని ఉప్పు శెట్టి సుధీర్ ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



### జనగణనలో ఖచ్చితత్వం,

# ప్రమాణాలను తూచా పాటించాలి

**కడప, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**

సమాచారం సేకరణలో ఖచ్చితత్వం మరియు ప్రమాణాలను అందించడం ద్వారా మన దేశ భవిష్య ఆర్థిక ప్రణాళికకు చక్కటి మార్గదర్శకాలు అందుతాయని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం జిల్లా ప్రజల్లో జనగణన 2027పై విస్తృత అవగాహన కల్పించే ఉద్దేశంతో 5కే రన్ కార్యక్రమాన్ని జిల్లా పరిపాలన యంత్రాంగం, కేఎంసి ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై సెన్సెస్ 2027 అవగాహన కల్పించే 2కే రన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ







జనగణన దేశ అభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ప్రతి పౌరుడు ఖచ్చితమైన వివరాలను సమర్పించడం ద్వారా ప్రభుత్వ పథకాల రూపకల్పనకు చక్కటి మార్గదర్శనం ఏర్పడుతుందన్నారు. అందుకు ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు జనగణనలో సక్రమంగా పాల్గొని, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 2027 జనాభా గణనను సమగ్రంగా డిజిటల్ విధానంలో నిర్వహించాలన్నారు. అదేవిధంగా, హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ యాప్ యొక్క ముఖ్య ఫీచర్లు, వినియోగ విధానం పై ఆమె ప్రజలకు వివరించారు. స్వీయ గణన విధానపు ప్రాముఖ్యతను, దాని ద్వారా సమయపాలన, ఖచ్చితత్వం, పారదర్శకత వంటి ప్రయోజనాలను వివరించారు. 2027 జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని తెలిపారు. మొదటి దశలో ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన మరియు రెండవ దశలో జనాభా గణన నిర్వహించబడుతుందన్నారు. రెండవ దశలో కుల గణన కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. మొదటి దశను మే 1 నుంచి మే 30 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ దశలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన మెటీరియల్, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం, అలాగే రేడియో, టెలివిజన్, స్మార్ట్ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు తదితర సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నల వివరాలను ఎన్యుమరేటర్ ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని వివరించనున్నట్లు తెలిపారు. అలాగే, ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్లైన్లో నమోదు చేసుకొనేందుకు ప్రత్యేక పోర్టల్ అందుబాటులో వుందన్నారు. కార్యక్రమంలో ముందుగా ఎమ్మెల్యే మాధవి రెడ్డి పచ్చ జెండా ఊపి సెన్సెస్ 2027 5కే రన్ ర్యాలీని ప్రారంభించారు. జిల్లా కలెక్టరేట్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ.. పలు ప్లకార్డులు, బ్యానర్లు పాటలతో నగరంలోని పలు ప్రధాన కూడళ్ల మీదుగా 7 రోడ్ల సర్కిల్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్వో వెంకటపతి, కడప నగరపాలక సంస్థ కమీషనర్ రాకేష్ చంద్రం, సెన్సస్ జిల్లా ఇంచార్జి మోహన్ రమణ, స్థానిక నాయకులు ఆర్.శ్రీనివాస రెడ్డి, రెడ్డెయ్య జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రజాప్రతినిధులు, ఎన్జీవో ప్రతినిధులు, మెప్మా మహిళలు, విద్యార్థులు, యువత, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# ఒకరిని చూసి... ఒకరు...

### అవసరం లేకపోయినా భారీగా కొనుగోలు

### అందుకే పెట్రోల్, డీజిల్ డిమాండ్

### యుద్ధం సమయంలో కూడా ఇలాంటి పరిస్థితి లేదు...!



రాజంపేటలో పెట్రోల్ బంక్ వద్ద చుట్టుముట్టిన జనం

**రాజంపేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరులో పెట్రోల్ బంకులు ఖాళీ. అక్కడ కూడా డిమాండ్ లేదు. ఎందుకు పుకారు పుట్టిందో తెలియదు. జనం పెట్రోల్ బంకుల వద్దకు క్యూలు కట్టారు .ఫలితంగా రోజులు వచ్చే నిల్వలు ఒకే రోజు మధ్యాహ్నానికి అయిపోయాయి. ఫలితంగా పెట్రోల్ బంకులు ఖాళీ అయ్యాయి. ఇది సామాజిక మాధ్యమాలలో వైరల్ గా మారింది. ఇక జనం చూడండి, ఒకరిని చూసి ఒకరు పెట్రోల్ బంకులకు బారులు తీరారు. ఫలితంగా కృత్రిమ కొరత ఏర్పడింది. ఈ పుకార్లు షికార్లు అయ్యాయి. జిల్లాలో శనివారం వరకు ఎక్కడ డీజిల్ పెట్రోల్ సమస్య లేదు. అయితే రాజంపేట, పుల్లంపేట ప్రాంతాల్లో ఉదయం నుంచి ఏమైందో తెలియదు కానీ పెట్రోల్ బంక్ వద్ద జనం బారులు తీరారు. అవసరం లేకపోయినా ఫుల్ ట్యాంకులు పట్టుకున్నారు. ఏమంటే తెలియదు. ఉదయం 8:00 కల్లా రాజంపేటలో ఎక్కువ పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిలవలు ఖాళీ అయ్యాయి. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. ఇదే విధంగా పలు పట్టణాల్లో జరిగింది. వెంటనే జిల్లా స్థాయిలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, సమీక్షి ంచారు .తక్షణం పెట్రోల్ బంకులను పరిశీలించాలని ఆయా డివిజన్ల అధికారులను ఆదేశించారు. యుద్ధం జరిగే సమయంలోనూ ఇలాంటి పరిస్థితి లేదు. యుద్ధ ముగిసింది. ఇక పెట్రోల్, డీజిల్ రాదనే సమస్య లేదు. మరి ఇలా ఎందుకు జరుగుతుంది. ప్రజల్లో ఇంధనంపై అభద్రతాభావం నెలకొంది. కృత్రిమ కొరతకు అనవసరంగా జనం ఇంధనం నిలవలు ఉంచుకోవడమే అని స్పష్టంగా అర్థం అవుతుంది. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు ఎంతవరకు నిజమనేది తెలుసుకోలేక పోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది.

# నిప్పుల కొలిమి ఒంటిమిట్ట, కడప 43.8

### భయంతో ఇళ్లలోనే జనం... తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వాతావరణశాఖ వార్నింగ్



నిర్మానుష్యంగా ఒంటిమిట్ట కోదండ రామాలయం పరిసరాలు

**రాజంపేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త**

భానుడు భగభగమంటున్నాడు. మండుటెండలు జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. ఇళ్ళకే పరిమితం చేస్తున్నాయి. ఒకవైపు వాతావరణ శాఖ హెచ్చరికలు, మరోవైపు భానుడి ప్రతాపంతో జనం హడలెత్తిపోతున్నారు. రానున్న మూడు రోజులు నిప్పుల కొలిమిగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. జనం జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. ఉదయం 11 గంటల తర్వాత బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేసింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ వేడిమి జనం భరించలేకపోతున్నారు. తాజాగా ఆదివారం జిల్లాలో ఎండలు మండాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం ఒంటిమిట్టలో 43.8 ,జిల్లా కేంద్రమైన కడపలో 43.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే రాజంపేట 43.1 బద్వేల్ 43, చెన్నూరు 43.1 ,చాపాడు 43.1, కొండాపురం 43.4 ,కాజీపేట 43.2, మైదుకూరు 43.2, పెద్దముడియం 43 ,పోరుమామిళ్ల 43, పులివెందుల 43.5 ,ఎర్రగుంట 43.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే వీరబల్లి 42.2 , బి కోడూర్ 42.8, దువ్వూరు 42, జమ్మలమడుగు 42.8, కలసపాడు 42 .4, లింగాల 42 .4 ,పొద్దుటూరు 42.8, తొండూరు 42.5, వేముల 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదేవిధంగా నందలూరు 41. 2 బి . మఠం 41.4, చక్రాయపేట 41, గోపవరం 41.6 ,కొండాపురం 41.8, మైదుకూరు 41.4 ,పెండ్లిమర్రి 41.2 ,రాజుపాలెం 41.4 ,కాశీనాయన 41.5, వల్లూరు 41.8 , వీరపునాయన పల్లె 41.9 ,వేంపల్లి 41.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# ఆట బోల్తా మహిళ కూలి మృతి

### :5 మందికి గాయాలు

**బద్వేలు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

నియోజకవర్గంలోని నక్కలగండి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ కూలి మృతి చెందారు. వివరాల్లోకెళితే బి. కోడూరు మండలం కొప్పరిదిన్నె పల్లెకు పత్తి కోసేందుకు బద్వేల్ మండలం లక్షీ ్మ పాలెం గ్రామం నుంచి 20 మంది మహిళలు బయలుదేరి పని ముగించుకుని వస్తుండగా మార్గమధ్యంలో నక్కల గండి వద్ద ఆటో టైరు పంచరై బోల్తాపడటంతో వంక రాజు నాగమ్మ (55) అనే మహిళ అక్క డికక్కడే మృతి చెందగా మరో ఐదు మంది మహిళ కూలీలకు గాయా లయ్యాయి. అనంతరం వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆటో డ్రైవర్ కు కాలు విరగడంతో మెరుగైన చికిత్స కోసం కడప కు తరలిం చారు.



# ఘనంగా అమ్మవారి జయంతి



**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**

పట్టణంలోని మెయిన్ బజార్ లో వున్న శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి మహోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి మహాప్రాకార ప్రదక్షిణాలు, తదుపరి చండీహోమం, పంచామృతాభిషేకం, సహస్ర నామ కుంకుమార్చన, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి తదుపరి సాయత్రం 6.30కి శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపివిరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానాధీ శులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ స్వహస్తములతో స్వర్ణ శ్రీచక్ర మేరువునకు (102 మంది సువాసినులతో) శ్రీ లలితా సహస్రనామ సహిత కుంకుమార్చన, మహా మంగళ హారతి, ఆశీర్వచనం స్వామి వారి చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సోషియల్ మీడియా నిర్వహణ నేనే చేశా

### కింద స్థాయి కౌంటర్లకు నాకు సంబంధం లేదు

### 80 కి పైగా ప్రశ్నల వర్షం

### నాకు తెలియదు సంబంధం లేదు అంటూ జవాబు

### రెండో రోజు భార్గవ్ తో కొసాగిన సుదీర్ఘ విచారణ

**పులివెందుల ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

పులివెందుల డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం సోషల్ మీడియా పోస్టుల కేసులో విచారణకు సజ్జల భార్గవరెడ్డి హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటలకు పులివెందుల డీఎస్పీ కార్యాలయంలో విచారణ కు భార్గవ్ రెడ్డి న్యాయ వాదులుతో కలిసి హాజరయ్యారు. వైకాపా అధికారంలో ఉండగా తెదేపా అధినేత చంద్రబాబు, నారా లోకేశ్, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సహా వారి కుటుంబసభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టుల తొలగించాలని పుల్లయ్య గారి హరి అనే అతను వర్ర రవీంద్రా రెడ్డి , సజ్జల భార్గవరెడ్డి లను తొలగించమని కోరగా అతని దగ్గర నుంచి డబ్బులు తీసుకుని తొలగించకుండా కులం పేరుతో దూషించారని హరి పులివెందుల పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నెంబర్ 409/24 అలాగే రాజంపేట పోలీస్ స్టేషన్ లో వెంకటాద్రి ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ ఐ ఆర్ నెంబర్ 411/24 నమోదు అయింది. ఈ కేసులో ఏ 1 గా వర్ర రవీంద్రారెడ్డి, ఏ2గా సజ్జల భార్గవరెడ్డి ఉన్న విషయం తెలిసిందే.శనివారం 10.30 నుంచి సాయంత్రం 7 గంటల వంకు సుమారు తొమ్మిది గంటలపాటు సుదీర్ఘంగా దాదాపు 80 ప్రశ్నలు వేయడం జరిగింది వీఆర్వోల సమక్షంలో ఆడియో, వీడియోల రూపంలో రికార్డ్ చేశారు. పోలీసుల ప్రశ్నలకు భార్గవ్ రెడ్డి సోషియల్ మీడియా రాష్ట్ర వ్యాప్తంగా నా ఆధ్వ ర్యంలో జరిగింది అని కానీ ఆ పోస్టింగ్ లు పెట్టడం నాకు తెలియదు నాకు సంబంధం లేదు అని సమాధానం ఇచ్చారు. డి.ఎస్.పి మురళి నాయక్ ఆధ్వర్యంలో, సీఐ నరసింహులు, క్రైమ్ ఇన్స్పెక్టర్, మధు మల్లేశ్వర్ రెడ్డి, సీఐ శివ శంకర్ రెడ్డి విచారణలో అడిగిన ప్రశ్నలకు సోషల్ మీడియా నాకు సంబంధమే కానీ , ఆ పోస్టుల కు నాకు సంబంధం లేదు, ఎవరు పెట్టారో తెలియదని సమాధానం ఇచ్చినట్టు తెలుస్తుంది. ఈ విచారణ రాత్రి 10:30 వరకు కొనసాగే అవకాశాలు ఉన్నాయి. భార్గవ్ రెడ్డి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో పోలీసులు మరోసారి విచారణకు పిలిచే అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. అయితే ఈ విచారణ మళ్ళీ కొనసాగుతుందా ఈరోజుతోనే ముగుస్తుంద అనేది తెలియాల్సి ఉంది. భార్గవ్ రెడ్డి తరఫున న్యాయవాదులు భాస్కర్ రెడ్డి ఓబుల్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.భార్గవ్ రెడ్డి విచారణ వీడియో కవరేజ్ మధ్య జరిగింది.ఇంకా మరోమారు విచారణకు పిలిపించే అవకాశాలు ఉన్నాయి.



డీఎస్పీ కార్యాలయం వద్ద విచారణ కి హాజరైన భార్గవ్ రెడ్డి



డీఎస్పీ కార్యాలయానికి విచారణకు వస్తున్న భార్గవ్ రెడ్డి

# బద్వేలులో వేధిస్తున్న పెట్రోల్ కొరత



**బద్వేలు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

బద్వేల్ పట్టణంలో పెట్రోల్ కొరత రోజురోజుకు తీవ్రమవుతోంది. పట్టణంలో ఆరు నుంచి ఏడు పెట్రోల్ బంకులు ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఒక్క బంకులో మాత్రమే పెట్రోల్ అందుబాటులో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిగతా బంకుల్లో పెట్రోల్ లేకపోవడంతో, అందుబాటులో ఉన్న ఒక్క బంకు వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరుతున్నాయి. గంటల కొద్దీ వేచి చూసినా కూడా చాలామందికి పెట్రోల్ దొరకడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, కొంతమంది వ్యక్తులు క్యాన్లలో పెద్ద మొత్తంలో పెట్రోల్ తీసుకెళ్లడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో సాధారణ వినియోగదారులకు పెట్రోల్ అందక ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయి. ఈ సమస్యపై సంబంధిత అధికారులు ఇప్పటివరకు పెద్దగా స్పందించకపోవడం పట్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. వెంటనే చర్యలు తీసుకుని అన్ని బంకుల్లో పెట్రోల్ సరఫరా సాధారణ స్థితికి తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు.

## జన్మజన్మల పుణ్యఫలం

## శ్రీవీరబ్రహ్మేంద్రుని దర్శన భాగ్యం..

4వ పేజీలో

## షాపు యజమానికి గాయాలు




మైదుకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: మైదుకూరు పట్టణ శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ నాలుగు రోడ్ల కూడలి నందు కూలింగ్ షాపులో కంప్రెసర్ కూలింగ్ ఫ్రిజ్ పేలింది. ఈ ప్రమాదంలో షాప్ యజమాని యేల్చూరి. అనంత్ కుమార్ కు గాయాలైనట్లు సమాచారం. శని వారం రాత్రి 10 గంటల సమయంలో జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. విషయం పోలీసులకు తెలియడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ ఘటనలో షాపు యజమాని యేల్చూరి. అనంత్ కుమార్ కర్నూల్ ప్రవేట్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ ఆరోగ్యంగా ఉన్నట్లు సమాచారం.

## పోలేరమ్మ పోతురాజు విగ్రహ ప్రతిష్ట

కలసపాడు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: మండలంలోని శంకవరం గ్రామంలో పోతురాజు పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట సోమవారం మూడు రోజులు జరిగే ప్రతిష్టను విజయవంతం చేయాలనిగ్రామ పెద్దలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే వచ్చే భక్తులకు మూడు రోజులు జరిగే ప్రతిష్ట కార్యక్రమానికి అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భజన కార్యక్రమం, పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బుధవారం బండ లాగుడు పోటీలు కూడా ఉంటాయని తెలియజేశారు.

## రమణయ్యను పరామర్శించిన పోతిరెడ్డి

కలసపాడు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: రాజకీయ సీనియర్ నాయకులు చింతలపల్లి గ్రామానికి చెందిన వావిళ్ళ రమణయ్య ఇటీవల అనారోగ్యం తో హైదరాబాదులోని అపోలో హాస్పిటల్ లో చికిత్స పొంది పూర్తిగా కోలుకొని తిరిగి ఇంటికి వచ్చిన సందర్భం గా విషయం తెలుసుకున్న మాజీ పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి, దేశాయ్ డాక్టర్ మార్కొ రెడ్డి, చింతలపల్లి గ్రామంలోని వారి ఇంటికి పోయి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గత రాజకీయ అనుభవాలను రమణయ్య ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం జరిగింది. రమణయ్య పూర్తిగా కోలుకొని మునపటిలా దైనందిగా జీవితంలో గడపాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జయంతి

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 26 ప్రభాతవార్త



మండల కేంద్రంలో వెలసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి ఉత్సవాలను అమ్మవారిశాల అధ్యక్షుడు అయ్యపు సురేష్ బాబు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి పంచామృత అభిషేకం గజమాల, తోమాల పూల లంకరణలతో పూజలు, నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ధర్మానికి త్యాగానికి ప్రతీక అని నిలువెత్తు రూపం ఆత్మగౌరవం కోసం అగ్నిలోనూ అడుగుపెట్టిన మహోన్నత తల్లి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత అని,అహింసా మార్గం మనబలం, ధర్మం మన ఆయుధం అనే మహోన్నత సందేశాన్ని మనకు అందించిన శ్రీ కన్యక పరమేశ్వరి అమ్మవారిని జయంతిని ఆర్యవైశ్య సోదర సోదరీమణులు, ఘనంగా జరుపుకోవాలి. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు బన్నూర్ కృష్ణమూర్తి ఉపాధ్యక్షులు ముచ్చర్ల శేషయ్య, యువ జన సంఘం అధ్యక్షులు యాదాళ్ళ వెంకటసుబ్బయ్య, సెక్రటరీ సుంకు సురేష్ బాబు, కోశాధికారి దుగ్గి శెట్టి వెంకటేశ్వర్లు, సుంకు సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వాసవి మాత జయంతి వేడుకలు

దువ్వూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన దువ్వూరులోని శ్రీ మరకత వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు ఆదివారం శ్రీ వాసవి జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జయంతిని ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు కలిసి అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు, పంచామృతాభిషేకము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి మాతను విద్యుత్ దీపాలతో, వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. మండలంలోని ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆరవటి సుబ్బారావు, పట్టాభి, ఆరవేటి రవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడే వైవీయూ బంద్



వైవీయూ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: విద్యార్థుల సమస్యలు పట్టని అధికారుల వైఖరికి నిరసనగా ఈ నెల 27 న వైవియు బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్, వైవియు పరిరక్షణ కమిటీ కన్వీనర్ అమృత కుమార్, కో కన్వీనర్ భరత్ సింహ పిలుపినిచ్చారు. ఆదివారం వైవియు ప్రధాన ద్వారం ముందు ఆందోళన అనంతరం బంద్ గోడ పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీ ఏర్పడి ఇరవై సంవత్సరాలు కావస్తున్న ఇంకా విద్యార్థులు నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నరన్నారు. క్యాంపస్‌లో ఇప్పటికి వైవియు అధికారుల నిరక్ష్యంల్ల వలన చాలా భవనాలు నిర్మాణ దశలోని ఆగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నాయకులు స్నేహ, భార్గవి, ప్రణతి, సత్య, సుస్మా, గణేష్, నాగూర్ బాబు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యినూతలకోన శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

పెండ్లిమర్రి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: పెండ్లిమర్రి మండలం చిన్నదాసరిపల్లె గ్రామం వెయ్యినూతులకోనలో వెలసిన శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం నందు ఈ నెల 30 నుంచి మే 2 వరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు వంశపారంపర్య ధర్మకర్త పిన్నపాటి నరసింహ హరిప్రసాద్ తెలిపారు. 28న విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధనం, గంగపూజ, అగ్నిప్రతిష్ట, శాంతిహోమం, ధ్వజారోహనం ఉంటుందన్నారు. 29న స్నపన తిరుమంజనం, వేదపారాయనం, మమానైవేద్యం, రాత్రి శేషవాహన సేవ, 30న నృసింహ జయంతి, అష్టోత్తర శతకలశ స్నపనం, పంచామృతాభిషేకం, వేదపారాయణం, మహా మంగళహారతి, రాత్రి హనమత్ వాహనం అలాగే మే1వ తేదీ సూర్యప్రభ వాహన సేవ, సాయంత్రం శ్రీచక్రపెరుమాల్ సేవ, ఊంజల్ సేవ, అన్నమాచార్య సంకీర్తనలు, రాత్రి నాటక ప్రదర్శనలు జరుగుతున్నాయని అనంతరం స్వామి వారి మెరవణి ఉంటుందన్నారు. చిన్నదాసరిపల్లెలో సీనియర్ వృషభరాజముల పోటీలు ఉంటాయన్నారు. 2వ తేదీ ఉదయం స్వామివార్ల కళ్యాణోత్సవం, మధ్యాహ్నం గజవాన సేవ, చక్రస్నానం, సాయంత్రం ధ్వజ అవరోహణం కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

## రేపటి నుండి జూన్ 6 తేది వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు

వేంపల్లి:ఏప్రిల్ 26 ప్రభాతవార్త మంగళవారం నుండి జూన్ 6 వ తేదీ వరకు జరగనున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వేంపల్లి లైబ్రరీ అధికారి వనజకుమారి తెలిపారు. ప్రతి విద్యార్థులు పాల్గొని విజయవంతం చెయ్యాలని ఆమె కోరారు. ఈ ప్రోగ్రాం లైఫ్ చిత్రాలేఖన,హస్తకళలు,చెస్, క్యారమ్,క్విజ్ పోటీలు తదితరుల జరుగుతాయాని ఆమె కోరారు.

## డీజిల్, పెట్రోల్ కొరతను అరికట్టండి

వేంపల్లె: ఏప్రిల్ 26 ప్రభాతవార్త



గత వారం రోజులుగా నియోజకవర్గంలో పెట్రోల్, డీజిల్ కొరతతో ప్రజా సరుకు రవాణా వాహనాలు అక్కడక్కడ నిలిచిపోతున్నాయని పెట్రోల్ డీజిల్ కొరత వల్ల నిత్యవసర సరుకుల ధరలు కూడా పెరిగే ప్రమాదం ఉందని పులివెందుల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త(ఇన్‌చార్జ్)మూలం రెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని ప్రభుత్వం ఒకవైపు చెపుతుంటే దానికి భిన్నంగా పెట్రోల్ బంకుల్లో డీజిల్ కొరతతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం కొరతను ఎందుకు నివారించలేకపోతుందని ప్రశ్నించారు. ప్రజలకు పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెప్పారు. పెట్రోల్, డీజిల్ సరఫరా లేదని యుద్ధం పేరుతో ధరలు పెంచాలని చూస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం తక్షణమే పెట్రోల్ బంకులన్నీ తనిఖీ చేసి కృత్రిమ కొరత సష్టిస్తున్న బంకు యజమానులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. పెట్రోల్, డీజిల్ కొరత వల్ల రవాణా రంగం పూర్తిగా దెబ్బతింటుందని, నిత్యావసర ధరలు కూడా పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## సతీష్ రెడ్డిపై విమర్శలు సబబు కాదు



వేంపల్లె: ఏప్రిల్ 26 ప్రభాతవార్త వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ రెడ్డిపై జిల్లా టిడిపి అధ్యక్షుడు భూపేష్ రెడ్డి విమర్శలు సబబు కాదని, వైసీపీ సీనియర్ నాయకుడు హేమాద్రి రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సతీష్ రెడ్డి పార్టీ మారాడని ఆరోపణలు చేస్తున్నారు.. మీ కుటుంబం ఎన్ని పార్టీలు మారిందో ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. 2014లో వైసిపి బి ఫారం మీద గెలిచింది తమ బాబయ్ కాదా అని భూపేష్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ సతీష్ రెడ్డికీ ఏ పరిస్థితుల్లో ఎమ్మెల్సీ పదవి ఇచ్చిందో ఆ పార్టీ నేతలకే తెలుసు అన్నారు. 2019లో టిడిపి ఓటమితో చంద్రబాబు, నేతలను అవమాన పరిచారని, దీంతో ఆ పార్టీకి సతీష్ రెడ్డి గుడ్ బై చెప్పారన్నారు. వైఎస్ జగన్, వైసిపి పట్ల ఆరోపణలు చేసే ముందు తమ ఫ్యామిలీకీ పెట్టిన బిక్ష గుర్తు లేదా అంటూ నిలదీశారు. ఇప్పటికైనా వైఎస్ కుటుంబం, సతీష్ రెడ్డి లపై నిరాదరణ ఆరోపణలు చేయడం మానుకోవాలని భూపేష్ రెడ్డికి ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామచంద్రారెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, అజయ్ కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## అవోపా ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణి



వేంపల్లి :ఏప్రిల్ 26 ప్రభాతవార్త వాసవి జయంతి సందర్భంగా వేసవికాలం రీత్యా వేంపల్లె ఆర్యవైశ్య అఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ వితరణ కార్యక్రమం నిర్వహించామని అవోపా అధ్యక్షులు బైరిశెట్టి వెంకట సునీల్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా వేంపల్లెలోని అమ్మవారిశాల వద్ద,మెయిన్ బజార్లో పాదచారులకు, ప్రజలకు 1200 మజ్జిగ ప్యాకెట్లు వితరణ చేశామని తెలిపారు.దాతల సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు మరియు అవోపా కార్యవర్గ సభ్యులకు అవోపా అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు.

## వేంపల్లెలో ఘనంగా వాసవి మాత జయంతి

వేంపల్లి : ఏప్రిల్ 26 ప్రభాతవార్త



వేంపల్లెలోని 122 సంవత్సరాలు చరిత్ర గల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి జయంతి ఉత్సవాలు 2రోజులు అంగరంగ వైభవంగా నిర్వహించామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో వాసవి మాతకు ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో మంగళ వాయిద్యాల నడుమ వేద మంత్రోచ్చారణతో పంచామృతాభిషేకం, కుంకుమార్చన, నైవేద్యం, మంత్రపుష్పం, మహా మంగళహారతి, తదితర విశేష పూజలు నిర్వహించామన్నారు. అలాగే మూలవిరాట్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన, లలితా సహస్రనామ స్తోత్తరాలు, వాసవి నామ అష్టోత్తర నామవలి పటించారు. సాయంత్రం వాసవి మాతకు సహస్ర దీపాలంకరణ, ఊంజల సేవ పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో 183 మంది మహిళలకు ఒడిబియ్యం పెట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శాశ్వత ఉభయదారులచే పూజా కార్యాక్రమాలు, అల్పాహారం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ, ఆలయ నిర్వాహకులు మిట్టా మోహన్ రావు, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కళ్యాణ మండపం, అవోపా, ఆర్యవైశ్య మహిళా మండలి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## 29న రాతి ధ్వజస్తంభ ప్రతిష్ట ఉత్సవాలు

దువ్వూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఏకోపల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ రామాలయం నందు శిథిలమైన పాత ధ్వజ స్తంభం స్థానంలో నూతన రాతి ధ్వజ స్తంభ పునః ప్రతిష్ట మహోత్సవాలు ఈనెల 29, 30, 1వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 29వ తేదీ బుధవారం గణపతి పూజా, రక్షా బంధనం, అఖండ దీపారాధన, అలాగే గురువారం కలుష ఆరాధన, పూల మంత్ర హోమము, రాతి ధ్వజ స్తంభంనకు విశేష పూజలు అలాగే గణపతి హోమం, మూల మంత్ర హోమాలు జరుగుతాయని అన్నారు. 1వ తేదీ శుక్రవారం ప్రధాన ఉత్సవం, రాతి ధ్వజస్తంభ పున ప్రతిష్ట యంత్రస్థాపన, సుదర్శన హోమం తదితర కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. అలాగే శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం కూడా జరుగుతుందన్నారు. అన్నదాన కార్యక్రమం కూడా ఉందని, భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

## రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు గృహాలక్ష్మి



వేంపల్లి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త స్థానిక పట్టణంలో ఆదివారం నాడు ఆర్ అండ్ బి బంగ్లాలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వీరనాల గృహలక్ష్మి రాయల్ అధ్యక్షతన ప్రజా సంకల్ప వేదికకు సంబంధించినపలు విభాగాల ఐడి కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజకీయ విభాగం కడప జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె.గంగయ్య, పిజిఆర్ కడప జిల్లా ప్రెసిడెంట్ సయ్యద్ మహమ్మద్, కడప జిల్లా మీడియా విభాగం వైస్ ప్రెసిడెంట్ గోసల ఆంజనేయులు, ప్రజా సమస్యల పరిష్కార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ అహ్మద్ అలీ, కడప జిల్లా వైస్ ప్రెసిడెంట్ ముస్లిం మైనారిటీ షేక్ షబ్బీర్, మహిళా విభాగం కడప జిల్లా వైస్ ప్రెసిడెంట్ కల మల్ల ఇంద్రావతి, వేంపల్లి మండల ప్రెసిడెంట్ చిన్న ఓబులేష్,రైతు విభాగ సంఘం వేంపల్లి మండల ప్రెసిడెంట్ అన్నం.రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న మదనపల్లి మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా



రామసముద్రం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త మండలంలోని ఎలవానెల్లూరు గ్రామంలో నూతనంగా ప్రతిష్టించిన శ్రీలక్ష్మి నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి గ్రామస్తుల ఆహ్వానం మేరకు మదనపల్లి మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా పాల్గొన్నారు. సందర్భంగా గ్రామస్తులు ఆయనకు పూలమాలలు వేసి మేళతాలలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీలక్ష్మీనర సింహ స్వామి వారిని దర్శించు కుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయ అర్చకులు కులశేఖర్ బటర్ స్వామి వేద మంత్రాలతో ఆశీర్వాదములతో దీవించారు, నవాజ్ బాషా మాట్లాడు తూ ఎలవానెల్లూరు గ్రామ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రతిష్టకు నన్ను ఆహ్వానం పలికినందుకు గ్రామ వైసీపీ నాయకులకు,గ్రామస్థులకు ధన్యవాదములు తెలుపుతున్న స్వామి వారిని ఆహ్లాధకరమైన గుట్ట ప్రదేశంలో దేవుడిని ప్రతి ష్టించడం చాలాసంతోషంగా ఉన్నదని స్వామి వారిని దర్శనం చేసుకోవడం నాపూర్వ సుకృతంగా భావిస్తున్నన్నారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామి దయతో వర్షాలు బాగా కురిసి సుఖ సంతోషాలతో ఉండాలనిమనస్ఫూర్తిగా కోరుకుంటున్న కార్యక్రమంలో,కేశవరెడ్డి, జడ్పీటీసీ రామచంద్రారెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు భాస్కర్ గౌడ్, ఉదయ్ శంకర్ రెడ్డి,దొడ్డిపల్లె ఆనంద,కత్తివాలెప్ప,డాక్టర్ ప్రకాష్ రాధారెడ్డి,దర్శన్ గౌడ్,దిన్నిపల్లె వెంకటరమణ, కృష్ణప్ప,కొమ్ము నారాయణ స్వామి,గొల్లపల్లె నాగరాజ, శివ సుబ్రహ్మణ్యం, సయ్యద్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రారంభమైన బాలాయ స్థాపన పూజలు



కలికిరి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: మండలంలోని గుండ్లూరు గ్రామంలో వెలసిన శ్రీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీబాలాయ స్థాపన పూజలు దేవాదాయశాఖ ఈవో పి.మంజుల ఆధ్వర్యంలో అదే విధంగా చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అంకురం స్వస్తి పుణ్యవాచనం పూజ, అంకుఆరోపన వృత్తికరణం, కలశ స్థాపన పూజలు నిర్వహించారు. ఈ ఆలయ పునర్నిర్మాణానికి పీలేరు నియోజక వర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సీజీఎఫ్ నిధులు రూ.1.20కోట్లు మంజూరు చేయించడం జరిగింది. ఈ మొత్తంలో 20% అనగా రూ.24లక్షలు దాతలు ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఐఆర్ఎస్ అధికారి రూ.12లక్షలు, అదే విధంగా మదనపల్లి డా.ఆర్.రామిరెడ్డి రూ.5లక్షలు, అద్దెవారిపల్లికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి రూ.7లక్షలు ఆలయానికి ఇవ్వడం జరిగింది. దీంతో ఆదివారం దేవాదాయశాఖాధికారులు ఆలయ కమిటీ సభ్యులు పూజలతో నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుండ్లూరు పంచాయతీ మాజీ సర్పంచ్ రెడ్డి వారి భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ అధికారి శశికుమార్‌రెడ్డి, ఆలయ ఈవో మంజుల, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చెన్నకేశవ స్వామి సేవలో ఐఆర్ఎస్ మాజీ అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి



కలికిరి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: మండలంలోని గుండ్లూరు గ్రామంలో వెలసిన శ్రీచెన్నకశవ స్వామిని మాజీ ఐఆర్ఎస్ అధికారి, శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డి కి దేవాదాయశాఖ ఈవో మంజుల, ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధికి ఇప్పటికే మాజీ ఐఆర్ఎస్ అధికారి మరియు మాజీ ఐఆర్ఎస్ అధికారి మరియు జాగృతి పవర్ హౌసింగ్ లాజిస్టిక్ ఆగ్రో ఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన డా.ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డి సుమారు రూ.12లక్షలు ఆలయ అభివృద్ధికి విరాళంగా అందించారు. తాను గుండ్లూరు గ్రామంలో పుట్టిపెరిగి విద్యనభ్యసించానన్నారు. తాను విద్యనభ్యసించిన గుండ్లూరు గ్రామంలో చెన్నకేశవ స్వామి ఆలయం ఉండడం ఆ స్వామి వారి కృపతోనే తాను ఉన్నత స్థాయికి ఎదిగి శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడం అంతా ఆ దేవుని కృపే అన్నారు. ఆదివారం ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయన సతీమణి రజితారెడ్డి, కుమార్తె శ్రావ్యారెడ్డి ఆలయానికి చేరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఐఆర్ఎస్ అధికారి శశికుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్డివారి భాస్కర్‌రెడ్డి, దేవాదాయశాఖ ఈవో మంజుల పాల్గొన్నారు.

## తంబళ్లపల్లె క్రాస్ రోడ్ లో అదనపు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు

తంబళ్లపల్లె ఏప్రిల్ 26 ప్రభాతవార్త : నియోజకవర్గ కేంద్రం క్రాస్ రోడ్‌లో విద్యుత్‌లో వోల్టేజ్ సమస్య కారణంగా విద్యుత్ శాఖ ఏడి గోవిందరెడ్డి ఆదేశాల మేరకు అదనపు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ ఎఈ సురేంద్ర తెలిపారు. క్రాస్ రోడ్‌లో చేనేత కార్మి కులు అధికంగా ఉండి విద్యుత్ అవసరాలు పెరగడంతో అదనపు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం వరకు క్రాస్ రోడ్‌లో అదనపు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు దిమ్మె నిర్మాణం, పలుచోట్ల విద్యుత్తులైన్ల మరమ్మతులు పూర్తి చేశారు. అనంతరం తంబళ్లపల్లె, కోసువారిపల్లె విద్యుత్ సబ్స్టేషన్ లను తనిఖీ చేసి అక్కడ విద్యుత్ సరఫరా, సమస్యలపై ఆరా తీసి పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట లైన్ ఇన్స్పెక్టర్లు భాస్కర్, నాగరాజు, లైన్మెన్ శంకర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుకు అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి



సీఎం కు అవార్డు రావడం పై అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి

పీలేరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఖీస్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ వంటి విప్లవాత్మక విధానాలతో అతి తక్కువ కాలంలోనే రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రతిష్ఠాత్మక అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పరిపాలనలో పారదర్శకత, పెట్టుబడులకు సులభతర వాతావరణం కల్పించడం వల్లే ఇంత భారీ స్థాయిలో పెట్టుబడులు వచ్చాయి. దీని వల్ల లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశా లు లభిస్తాయి అని ఎమ్మెల్యే తెలిపారు. దేశంలోనే ఏపీని అగ్రగామిగా నిలపాలన్న చంద్రబాబు సంకల్పానికి ఈ అవార్డు నిదర్శనమని, ఆయన విజన్‌కు అనుగుణంగా పీలేరు నియోజకవర్గ అభివృద్ధికి కూడా తాను కృషి చేస్తానని కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## టోల్ సిబ్బందిపై దాడి ఘటనలో సీఎం చంద్రబాబు స్పందన తీరు హర్షం

డిబిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బద్దె భాను ప్రకాష్ సెల్యూట్



పీలేరు ఏప్రిల్ 26 ప్రభాతవార్త: టోల్ గేట్ వద్ద దాడి చేసిన కల్యాణ దుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు అనుచరులపై కేసులు నమోదు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించడం దళిత బహుజన విద్యార్థి ఫెడరేషన స్వాగతిస్తుంది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి కేసులు నమోదు చేయాలని ఆదేశించడం కూటమి ప్రభుత్వానికి నిదర్శనమని అక్కడ పనిచేస్తున్న మహిళని జుట్టు పట్టుకొని లాగడం చాలా బాధాకరం టోల్ ప్లాజా వద్ద సిబ్బందికి భద్రత కరువైందని . శనివారం అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం గండబోయినపల్లి వద్ద గల టోల్ ప్లాజా వద్ద పనిచేస్తున్న సిబ్బందిపై కళ్యాణ దుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు అనుచరులు దాడి చేసి బీభత్సం సృష్టించారు. ఈ సందర్భంగా దళిత బహుజన విద్యార్థి ఫెడరేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు బద్దె భాను ప్రకాష్ మాట్లాడుతూ టోల్ ప్లాజా వద్ద తమ వాహ నా ల టోల్ గేట్ ఫీజు కూడ కట్టలేని ఈ విధంగా సిబ్బందిపై దాడి చేయడం అమానుషమని దారుణమని ఖండించారు. ప్రభుత్వము టోల్ ప్లాజాల వద్ద భద్రత ఏర్పాటు చేయాలని దళిత బహుజన విద్యార్థి ఫెడరేషన్ డి.బి. ఎస్. ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు బద్దె భాను ప్రకాష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## అంకాలమ్మ తల్లి చల్లగా చూసుకో తల్లి



నిమ్మనపల్లి ఏప్రిల్ 26 ప్రభాతవార్త నిమ్మనపల్లి మండలం పంచాయతీ నాయనవారిపల్లి లో నూతనంగా ఆ గ్రామస్తులు అందరూ కలిసి కట్టుగా ఉండి ఒక గుడిని అతి సుందరంగా నిర్మించుకున్నారు ఈ దేవాలయంలో ఆంకాలమ్మ నామకరణం చేసి గత మూడు రోజులుగా పూజలు చేసి కందూర్ కు చెందిన రవీంద్ర శర్మ వేద పండితులచే ప్రత్యేక పూజలు గావించి ఆదివారం దేవాలయాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా మూడు రోజులు అఖండ భజనలు మొదటి రోజు గంగపూజ గోపూజ గణపతి పూజ రెండో రోజు పంచామృత అభిషేకాలు గ్రామోత్సవం మూడో రోజు ఎంత్రీకరణ విగ్రహ ప్రతిష్ట మహాకుంభాభిషేకాలు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి ఇదే గ్రామనివాసి టీ తరుణ్ టి నారాయణ గుడి స్థలాన్ని దేవాలయానికి విరాళంగా అందించారు భారీ సంఖ్యలో అన్నదానం జరిగింది ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు వీరు వెంట తెలుగుదేశం నాయకులు ఓబుల్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి మాజీ ఎంపీపీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు చుట్టుపక్కల గ్రామాల వారు వందల సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## మానవత్వం చాటుకున్న తంబళ్లపల్లె ఎమ్మెల్యే

గాయపడిన వ్యక్తిని తన వాహనంలో ఆసుపత్రికి తరలింపు



తంబళ్లపల్లె ఏప్రిల్ 26 ప్రభాతవార్త : తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి శుభకార్యం లేదా ఆ శుభకార్యం ఏదైనా తనకు తెలిసిన వెంటనే స్పందించడం తనకు చేతనైన సాయం చేయడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం. ఇందులో భాగంగా ఆదివారం నడిరోడ్డులో ప్రమాదం జరిగి ఓ వ్యక్తి గాయపడి బాధలో ఉన్న అతన్ని తన సొంత వాహనంలో హుటాహుటిన మదనపల్లి ఆస్పత్రికి తరలించి తన మానవత్వాన్ని మరో మారు చాటుకుని శభాష్ ఎమ్మెల్యేగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆదివారం కుప్పం నియోజకవర్గంలో ఓ వివాహానికి హాజరై తిరుగు ప్రయాణంలో తంబళ్లపల్లెలోని తన స్వగృహానికి తన వాహనంలో బయలుదేరాడు. మదనపల్లితంబళ్లపల్లె ప్రధాన రహదారి జోగివానిబురుజు సమీపంలో వస్తుండగా అదే సమయంలో ఓ రోడ్డు ప్రమాదం జరిగి ద్విచక్ర వాహనంలో వస్తున్న తంబళ్లపల్లెకు చెందిన మహబూబ్ పీర్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనం కోసం ఎదురుచూస్తున్న సంఘటన చూసి చెలించి పోయిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి హుటాహుటిన వాహనం ఆపి బాధితున్ని పరామర్శించి ధైర్యం చెప్పి తన వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్సలు దగ్గరుండి చేయించాలని మండల వైకాపా అధ్యక్షుడు రేపన చౌడేశ్వర, నాయకులను పురమాయించి ప్రమాద విషయం బాధితులు కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు.అనంతరం వేరే వాహనంలో ఎమ్మెల్యే తంబళ్లపల్లె స్వగృహానికి బయలుదేరారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రమాద స్థలంలో ఆయన పడిన ఆందోళన, చూపిన చొరవ చూసి స్థానిక ప్రజలు ఔరా మన ఎమ్మెల్యే మనసున్న మారాజని కొనియాడడం కొసమెరుపు.

## రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు గృహాలక్ష్మి



వేంపల్లి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త స్థానిక పట్టణంలో ఆదివారం నాడు ఆర్ అండ్ బి బంగ్లాలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వీరనాల గృహలక్ష్మి రాయల్ అధ్యక్షతన ప్రజా సం కల్ప వేదికకు సంబంధించినపలు విభాగాల ఐడి కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజకీయ విభాగం కడప జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె.గంగయ్య, పిజిఆర్ కడప జిల్లా ప్రెసిడెంట్ సయ్యద్ మహమ్మద్, కడప జిల్లా మీడియా విభాగం వైస్ ప్రెసిడెంట్ గోసల ఆంజనేయులు, ప్రజా సమ స్యల పరిష్కార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ అహ్మద్ అలీ, కడప జిల్లా వైస్ ప్రెసిడెంట్ ముస్లిం మైనారిటీ షేక్ షబ్బీర్, మహిళా విభాగం కడప జిల్లా వైస్ ప్రెసిడెంట్ కల మల్ల ఇంద్రావతి, వేంపల్లి మండల ప్రెసిడెంట్ చిన్న ఓబులేష్,రైతు విభాగ సంఘం వేంపల్లి మండల ప్రెసిడెంట్ అన్నం.రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గణిత మేధావి శ్రీనివాస
## రామానుజన్ వర్ధంతి సంస్మరణ



ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 26 ప్రభాతవార్త
గణిత శాస్త్ర చరిత్రలో అపూర్వ ప్రతిభ కలిగిన మహానుభావుల్లో ఒకరైన శ్రీనివాస రామానుజన్ జీవితం ఆశ్చర్యకరంగానూ, ప్రేరణాత్మకంగానూ నిలిచింది. సంక్లిష్ట గణిత సూత్రాలు, శ్రేణులు, సంఖ్యా సిద్ధాంతం వంటి విభాగాల్లో ఆయన చేసిన కృషి అపారమైనది. డిసెంబర్ 22, 1887న తమిళనాడులోని ఈరోడ్ లో జన్మించిన రామానుజన్, 1920 ఏప్రిల్ 26 న పరమపదించారు అని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. ఆదివారం శ్రీరాముల పేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో శ్రీ రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ రామానుజన్ తక్కువ వయస్సులోనే (32 ఏళ్లకు) మరణించినప్పటికీ గణిత శాస్త్రంలో విశేష కృషి చేసి చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన ఆవిష్కరించిన గణిత సూత్రాలు నేటికీ పరిశోధనలకు ప్రేరణగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. 1918లో రాయల్ సొసైటీ సభ్యత్వం పొందడం, అలాగే ట్రినిటీ కాలేజ్లో ఫెలోగా ఎన్నిక కావడం ఆయనకు లభించిన గొప్ప గౌరవాలుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు సుబ్బయ్య, సంజీవరెడ్డి,ఉపాధ్యాయులు విజయ్ మోహన్ రెడ్డి, సుధాకర్, రామ చంద్రారెడ్డి, రామిరెడ్డి, మధు మరియు వేమ నారాయణ, కృష్ణారెడ్డి, సాయి పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ డిమాండ్ తాత్కాలికం మాత్రమే
### సబ్ కలెక్టర్ హెచ్ ఎస్ భావన
### రాజంపేటలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



పెట్రోల్ బంక్ నిర్వాహకులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ భావన

రాజంపేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త
రాజంపేట పరిసర ప్రాంతాల్లో డీజిల్ ,పెట్రోల్ డిమాండ్ తాత్కాలికం మాత్రమేనని సబ్ కలెక్టర్ హెచ్ ఎస్ భావన తెలిపారు. సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. అంతరాయం తాత్కాలికం మాత్రమే అని చెప్పారు. జిల్లా కలెక్టర్ తో చర్చించామని ఇంధనం నిల్వలపై అపోహాలు అవసరం లేదని, త్వరలోనే సరఫరా పునరుద్ధరించి ప్రజలకు డీజిల్ ,పెట్రోల్ కొరత లేకుండా చేస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో సబ్ కలెక్టర్ రాజంపేటలోని అన్ని పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రతి పెట్రోల్ బంక్ వద్ద ఒక రెవెన్యూ ప్రతినిధి ఉంటారని స్పష్టం చేశారు. అందుకే సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఒక కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు అనుమానం ఉంటే 94413 44273 నెంబర్ కు ఫోన్ చేయాలని కోరారు.

## కారు ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలు

వైవీయూ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:
సిద్ధవటం రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి బలమైన గాయాలు తగలడంతో మెరుగైన వైద్య సేవలు కోసం కడప రిమ్స్ తరలించారు. మండల కేంద్రమైన సిద్ధవటం హై లెవెల్ వంతెన పై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బద్వేల్ వైపు నుండి బెంగళూరు వెళ్తున్న కారు భాకరాపేట వైపు నుండి ద్విచక్ర వాహనంలో వస్తున్న కోటయ్య అనే వ్యక్తిని కారు ఢీకొన్న ఘటనలో తన ఎడమ కాలు కు బలమైన గాయాలు తన చెవిలో నుండి రక్తం రావడంతో స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు స్థానిక వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్య సేవలు కోసం 108 వాహనంలో కడప రిమ్స్ తరలింపు చేపట్టారు జరిగిన ఘటనపై మండల ఎస్సై పోకల హరిక ఆధ్వర్యంలో పోలీసులు విచారిస్తున్నారు.

## బద్వేల్‌లో రిటైర్డ్ డీఐజీ, గుణశేఖర్ రెడ్డి, ఏసీపీ కిరణ్ కుమార్ పర్యటన



బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 26 ప్రభాత వార్త :
తెలంగాణ ఏసీబీ కిరణ్ కుమార్, రిటైర్డ్ డీఐజీ గుణశేఖర్ రెడ్డిలు ఆదివారం జిల్లా బద్వేల్ పట్టణంలో పర్యటించారు. బ్రహ్మంగారిమఠంలో జరిగిన ఆరాధన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన, అనంతరం బద్వేల్ పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా బద్వేల్ పట్టణానికి విచ్చేసిన రిటైర్డ్ డిఐజి గుణశేఖర్ రెడ్డి, ఏసిపి కిరణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ నాగార్జున, లక్ష్మణరావు భోగేశ్వరరావు తిరుమల సాయికృష్ణ, టిడిపి నాయకులు రమేష్ నాయుడు, బిజెపి నాయకులు విశ్వనాథ్ ఆచారి తో పాటు పలువురికి శాలువాతో కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు పలు సామాజిక అంశాల గురించి మరియు బ్రహ్మంగారిమఠం విశిష్టత గురించి కొద్దిసేపు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపెంట సురేష్ బాబు, అడ్వకేట్ పత్తి నాగేంద్రప్రసాద్, విద్యావేత్త సి,వి నాగేశ్వరరావు, జొన్నలగడ్డ సుధాకర్, రవీంద్రబాబు, నిఖిల్, వల్లంకొండు రాఘవేంద్ర, పత్తి హరీష్, దద్దం వంశీ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## జనాభా లెక్కల అవగాహనపై భారీ ర్యాలీ

పెండ్లిమర్రి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:
భారత దేశ జనాభా లెక్కల–2027 నేపథ్యంలో ప్రజలు స్వయంగా నమోదు చేసుకోవాలనే ఉద్దేశంతో తహసీల్దారు ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక మండల కేంద్రంలో ప్రారంభమై ముఖ్య వీధుల గుండా సాగింది. జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి చాలా కీలకమని, ప్రతి కుటుంబం తప్పనిసరిగా సరైన వివరాలను నమోదు చేయాలని తహసీల్దారు సూచించారు. ర్యాలీలో గ్రామ అధికారులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం పెంపొందించి ప్రతి ఒక్కరూ తమ వివరాలను సమయానికి నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు.




## భక్తిశ్రద్ధలతో శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి





మైదుకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:
శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా మైదుకూరు పట్టణ కడప రోడ్డు శివుని మాన్యం వీధిలోని వినాయక స్వామి గుడి నుండి ఆర్యవైశ్యులు కలశాలతో ఊరేగింపుగా నంద్యాల రోడ్డు అమ్మవారి శాలకు వెళ్లి కలశాల నీటితో అమ్మవారికి అభిషేకం జరిపించారు. అనంతరం లక్ష పుష్ప అర్చన, పూజా కార్యక్రమాలు, మహా మంగళహారతి తో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్యులు పలువురు మాట్లాడుతూ అమ్మవారు కలియుగంలో ధర్మాన్ని రక్షించడానికి, స్త్రీ శక్తిని చాటడానికి వాసవీ కన్యకాపరమేశ్వరిగా అవతరించారు. ఈ రోజును భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం వల్ల కుటుంబంలో ఐకమత్యం, వ్యాపారంలో అభివృద్ధి, మనశ్శాంతి లభిస్తుందని భక్తుల నమ్మకం. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి భక్తులకు సకల శుభాలు చేకూర్చాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు పట్టణ ఆర్యవైశ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సభ యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు అధికంగా కొనుగోలు





మైదుకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:
రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుంది అనే ఆందోళనలో వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం పెట్రోల్ బంకుల్లో వాహనాలకు ఫుల్ ట్యాంక్ తో పాటు అధికంగా కొనుగోలు చేయడంతో కారణంగా పలు బంకుల్లో స్టాక్ దొరకదు అనే ఆందోళనలో వాహనదారులు ఇతరులు కొనుగోళ్ల వల్ల ఈ కొరత ఏర్పడుతుంది. కడప జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా సమీక్ష సమావేశంలో పరిస్థితిని సమీక్షిస్తూ, చమురు సరఫరాను క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ కొరత లేదని అధికారులు ఆదేశించిన వాహనదారులు, కొందరు బ్లాక్ మార్కెట్ కు తరలించే వ్యక్తులు అధికంగా కొనుగోలు చేయడంతో పెట్రోల్ బంకుల దగ్గర రద్దీ పెరగడంతో పాటు సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు తమ వద్ద ఇంధనం లేకపోతే ఇబ్బంది పడతామనే భయంతో ఎక్కువ మొత్తంలో కొంటున్నారు. సాధారణ రోజువారీ అవసరం కంటే 50 శాతం పైగా డిమాండ్ పెరిగింది. కొన్ని బంకుల్లో ఇంధనం ఖాళీ అయి,నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. అధికారులు ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని చెబుతున్న మారని పరిస్థితి, అధికారులు అనవసరంగా ఎక్కువ ఇంధనం కొనకండి, ఇది కొరతను మరింత పెంచుతుంది. బంకులలో సరఫరా సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు చర్యలు చేపట్టకపోతే సామాన్యులు ఇబ్బందులు పడతాము అనే ఆందోళన చెందుతున్నారు.

## రాజంపేటలో ఘనంగా వాసవి జయంతి వేడుకలు





రాజంపేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త
వాసవి మాత జయంతి వేడుకలు రాజంపేట పట్టణంలో ఆదివారం వైభవంగా జరిగాయి. స్థానిక అమ్మవారి శాలలో ఆర్యవైశ్య సోదరులు భక్తిశ్రద్ధలతో వాసవి జయంతి వేడుకలలో పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారికి మేలుకొలుపు పాడి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకాలు చేశారు. ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. వాసవి జయంతిని పురస్కరించుకుని దోర్నాదుల వెంకటేష్ , హరి కుటుంబ సభ్యులు అమ్మవారికి కొత్త నగలను చేయించారు. నూతన నగలను సంప్రోక్షణ చేశారు. అనంతరం అమ్మవారికి జయంతిని పురస్కరించుకుని అలంకరించారు. వాసవి జయంతి సందర్భంగా ఆర్యవైశ్య మహిళా భక్తులు పట్టణంలో వాసవి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు. జై మాత, వాసవి మాత అంటూ నినాదాలు చేశారు. వాసవి జయంతి సందర్భంగా స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రందే సత్యనారాయణ గుప్త, సనిశెట్టి నవీన్ కుమార్, పెంజూరు నరసింహ,వినయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూములు కాజేసే నైజం రాజమల్లుదే



ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త
భూములను కాజేసే నైజం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దేనని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో వైసీపీ పాలనలో విలేఖరులను దుర్భాషలాడిన రాచమల్లు, పలువురిని ఊరిలో కూడా లేకుండా చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు మాత్రం ఒక యూట్యూబర్ విషయంలో కపట ప్రేమ చూపారని విమర్శించారు. అదేవిధంగా 150 కోట్ల రూపాయల ప్రభుత్వ స్థలాన్ని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి కాజేసే యత్నం చేస్తున్నారని ఆరోపించిన రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నిరూపించాలని, ఆయన అనుకూల పత్రికలో రోజుకొకలా వార్తలు రాయిస్తున్నారని విమర్శించారు. గత రాచమల్లు శివప్రసాద్ రెడ్డి భార్యభర్తల పంచాయతీ లో డబ్బు తీసుకుని మహిళకు న్యాయం చేయకపోగా, టిడిపి నాయకులు కొండారెడ్డి వారిరువురిని కలిపారని తెలిపారు. ఆ భూమి విషయంలో ఒక పత్రికలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పై కబ్జా ఆరోపణలతో వార్త రాశారని, దానిపై తాము ప్రవేట్ కేసు వేయనున్నామని స్పష్టం చేశారు. ఇకనైనా దిగజారుడు విమర్శలు మానుకోవాలని సూచించారు. అనంతరం టిఎన్టీయుసి జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్ మాట్లాడుతూ టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎటువంటి అవినీతికి పాల్పడటం లేదని వైసీపీ నాయకులు బురదజల్లడం పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. మా నాయకుడు కొండారెడ్డి పెన్ను పెట్టుకుని తిరిగితే గన్ను పట్టుకున్నాడని దుష్ప్రచారం చేయడం వైసిపి నేతలకు అలవాటైందన్నారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మధ్యలో నిలిచిపోయిన మార్కెట్ను బిల్లులు తెప్పించి మళ్లీ ప్రారంభించారన్నారు. రానున్న స్థానిక సంస్థల, సార్వత్రిక ఎన్నికలలో తామే విజయం సాధిస్తామని వివరించారు. కేవలం అభివృద్ధి పై సూచనలు చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి తలారి పుల్లయ్య, జనసేన నాయకులు సుంకర మురళీ తదితరులు పాల్గొన్నారు.

## జన్మజన్మల పుణ్యఫలం శ్రీవీరబ్రహ్మేంద్రుని దర్శన భాగ్యం..



సింహాసనాసీనులైన శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి వారు



బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 26 ప్రభాతవార్త
భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞాన సృష్టికర్త జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 333వ ఆరాధన గురుపూజ మహోత్సవాల వేడుకలు వైభవోపేతంగా కళాకాంతుల తో భక్తుల భక్తి భావనల మధ్య అంగరంగ వైభవంగా జరుగుచున్నది. ప్రాతఃకాలం నుండి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి సుప్రభాత నామ కీర్తన అభిషేక సహస్రనామార్చన కార్యక్రమాలతో మొదలై స్వామివారు సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్ర సుదినమైన వైశాఖ శుద్ధ దశమి ఆదివారము నాడు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దర్శన భాగ్యం కోసం బారులు తీరారు జై వీర బ్రహ్మ జై గోవిందమాంబ జై అనే నామస్మరణతో బ్రహ్మంగారి మఠం మొత్తము మారు మోగింది. క్యూ లైన్ లో వున్న భక్తులకు మజ్జిగ మంచి నీళ్ళు అందించారు. బ్రహ్మంగారి దర్శనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనం కోసం వచ్చారు.

వైశాఖ శుద్ధ దశమి నాడు స్వామి వారు సజీవ సమాధినిష్ఠ వహించిన పవిత్ర దినము నాడు మఠాధిపతులు శ్రీ శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామల వారు సింహాసనాసీనులై భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు మాలా దీక్షపరులకు స్వామివారు మాల విరమణ చేసి స్వామివారి ఆశీర్వచనములు కలిగేలా దీవించారు. ఆరాధన గురుపూజ మహోత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మఠాధిపతులు శ్రీ వీరధర్మల వెంకటాద్రి స్వాముల వారి అనుమతులతో మఠం మేనేజర్ ఈశ్వరయ్య చారి ఆదేశాల మేరకు మైదుకూరు డి ఎస్పి రాజేంద్రప్రసాద్ సీఐ శివశంకర్ ఎస్సై శివప్రసాద్ ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో దర్శనం కలిగేలాగా చర్యలు చేపట్టారు.

## శేష వాహనంపై అగస్త్యేశ్వరుడు



ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త
పట్టణ నడిబొడ్డున వున్న అగస్త్యేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు ఆదివారం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు అమ్మవారికి కుంకుమార్చనలు దీక్షామంటప పూజలు దీక్షా హోమాలు నిత్య గ్రామ బలిహరణ స్వామి అమ్మవార్ల మిరవణి, సాయంత్రం మంటప పూజలు దీక్షా హోమములు నిత్య గ్రామ బలిహరణ స్వామి అమ్మవార్లు శేషవాహనం పై గ్రామోత్సవం అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, తెలుగు వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు, కవి సాహితీ వేత్త ఆయుర్వేద వైద్యులు పూర్ణచందు, మాజీ యం.పి.పి. నంద్యాల రాఘవ రెడ్డి ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు ఆలయ చైర్మన్ మరియు పాలకమండలి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు హైదరాబాద్ వాస్తవ్యులు తెలుగు వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు వారిచే శివ కవితా వైభవం గొప్పప్రవచనం వంటి కార్యక్రమములు అత్యద్భుతంగా జరిగాయి. ఆలయానికి వందలాది మంది భక్తాదులు వచ్చి స్వామి వారిని దర్శించి సేవించి తరించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి. రమణ, ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌కు సన్మానం



పులివెందుల, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :
మాజీ మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా పులివెందుల పట్టణంలో వైసీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీ విజయ్ కుమార్, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి,శ్రీను తదితరులు వరప్రసాద్‌కు శాలువ కప్పి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలి పారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వరప్రసాద్‌కు వచ్చిన పదవి పార్టీ పట్ల ఆయన చూపిన కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. వరప్రసాద్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతను నెరవేర్చేందుకు కట్టుబడి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జనగణన అవగాహనపై 2కె రన్




మైదుకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:
మైదుకూరు పట్టణ కడప రోడ్డు ఎంపిడిఓ ఆవరణము నుండి 2కె రన్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపాలిటీ కమిషన్ రంగస్వామి, మండల తహసిల్దార్ రాజసింహ నరేంద్ర పాల్గొన్నారు. భారత జనగణన – 2027 కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 2కే రన్ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషన్ రంగస్వామి, మండల తహసిల్దార్ రాజసింహ నరేంద్ర, సచివాలయ సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు ఎంపిడిఓ కార్యాలయం ఆవరణము నుండి భారత జనగణన 2027 అవగాహనపై బ్యానర్ పట్టుకొని ప్రజలకు అవగాహన కల్పిస్తూ కడప రోడ్డు నుండి ప్రొద్దుటూరు రోడ్డు శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్ వరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## జనగణన - సెల్ఫ్ ఎన్యూమరేషన్‌పై అవగాహన




వైవీయూ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:
మొబైల్, ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ ఎన్యూమరేషన్ నమోదు విధానంపై యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్–9 వాలంటీర్లు పెండ్లిమర్రి మండలం, వెల్లటూరు గ్రామ ప్రజలకు అవగాహన, నమోదు కల్పించారు. అవగాహన నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి వీధి, కూడలిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రజలకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రాముఖ్యతను వివరించి, చాలా మంది తమ కుటుంబ వివరాలను స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేలా సహాయం చేశారు. ఇంటర్నెట్ సదుపాయం లేని వారు యోగి వేమన యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ యూనిట్–9 వాలంటీర్ల సహాయం తీసుకోవచ్చని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే 9948743830, 9948438961, 8297838153, 6304451702 నంబర్స్‌కి సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్ యజమానులకు పోలీసుల సమావేశం



ముద్దనూరు, ఏప్రిల్.26. ప్రభాతవార్త;
పట్టణంలోని పెట్రోల్ డీజిల్ బంక్ యజమానులతో స్థానిక పోలీస్ స్టేషన్ నందు సీఐ నగేష్ బాబు ఆదివారం నాడు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ కొరత ఉన్నందున డీజిల్ బంకు యజమానులకు అక్రమంగా నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయించడం వంటి పనులకు పాల్పడకూడదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బాటిళ్ల లేదా క్యాన్లలో ఇంధనాన్ని విక్రయించరాదని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి అక్రమ విక్రయాలకు పాల్పడితే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యజమానులను హెచ్చరించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, పారదర్శకంగా ఇంధన విక్రయాలు జరపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంక్ యజమానులు పాల్గొన్నారు.

## మానవతా నెలవారీ సమావేశము

సుండుపల్లె, ఏప్రిల్ 26,ప్రభాతవార్త :
మండల మానవతా నెలవారి సమావేశము 26 వ తేది ఆదివారం ఉదయం మండల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేయడమైనదని అధ్యక్షులు లక్షుమయ్యానాయుడు తెలిపాడు. మొదటగా గత సంవత్సరము యొక్క ఆర్థిక నివేదికను డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి చదివి వినిపించినారు తదుపరి అధ్యక్షులు మాట్లాడుతూ మే నెలలో మానవతా ఆధ్వర్యంలో ఒక మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయుచున్నామని అలాగే ఈ వారంలోనే ఒక చలివేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణంరాజు, ఉమ్మడి కడప జిల్లా ఆర్థిక కార్యదర్శి హరికుమార్, సెక్రటరీ నాయక్, కోశాధికారి నరసింహ, డైరెక్టర్లు రెడ్డప్ప నాయుడు, శ్రీధర్ రెడ్డి, మరియు సుబ్రహ్మణ్యం గణపతి, శంకర్‌నాయక్, మహబూబ్ బాషా, ఉస్మాన్ భాష, శంకర్‌స్వామి ఇంకా మానవత కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది

